క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన రవికుమార్ పని నిమిత్తం గూడూరుకు వెళ్తుండగా చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలో కొలువైన వరసిద్ధి వినాయకునికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా కావేటి పెంచలయ్య, లక్ష్మమ్మ దంపతులు వ్యవహరించారు.

కవి పెరుగు రామకృష్ణకు పురస్కారం

నెల్లూరు(బృందావనం) : గ్రీకు, ఇటాలియన్ దేశాలకు చెందిన ఇద్దరు మహా రచయితలు హోమర్, డాంటేల స్మారక అంతర్జాతీయ పురస్కారాలను నెల్లూరీయుడైన తెలుగు కవి డాక్టరు పెరుగు రామకృష్ణ అందుకున్నారు. అందుకు సంబంధించి పెరుగు రామకృష్ణ బుధవారం మాట్లాడారు. ప్రాచీన గ్రీకు సాహిత్యానికి, పాశ్చాత్య సాహిత్య సంప్రదాయాలకు పునాది వేసిన హోమర్, అలాగే ఇటాలియన్ కవి, రచయిత డాంటే అలిఘిరి సాహిత్య పురస్కారాలను ఆల్‌లైన్ ద్వారా అందుకున్నట్లు వివరించారు. తాను చేసిన రచనలకు గుర్తింపుగా ఆయా దేశాలకు చెందిన సంస్థల నిర్వాహకులు పురస్కారాలను ప్రదానం చేశారని తెలియజేశారు.

సులభంగా పక్షవాత నిర్ధారణ

నెల్లూరు(మినీబైపాస్) : అధునాతన కెరోటిడ్ డాప్లర్ యంత్రం ద్వారా పక్షవాతాన్ని ముందుగానే నిర్ధారించవచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని తెలిపారు. పెద్ద బజారులోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలో న్యూరాలజీకి సంబంధించి అధునాతన పద్ధతుల్లో తయారు చేసిన కెరోటిడ్ డాప్లర్ యంత్రాన్ని పొగతోటలోని యామిని న్యూరో కేర్ వైద్యశాలలో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎండీ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం

• కమిషనర్ వికాస్ మర్మత్



నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాను వాటర్ మానిటరింగ్ స్కీమ్ అప్లికేషన్‌తో పర్యవేక్షిస్తామని, దీనిద్వారా 24 గంటల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ వెల్లడించారు. ఈ మేరకు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం, సచివాలయ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతన వాటర్ మానిటరింగ్ టూల్ నిర్వహణకు ప్రతి అమెనిటీస్ సెక్రటరీకి లాగిన్ ఉంటుందన్నారు. స్థానిక కార్యదర్శి పరిధిలో అన్ని వీధుల వివరాలు, ఇళ్ల వివరాలు, వారి పేర్లు, డోర్ నంబర్లు తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. తరువాత ఎమెనిటీ సెక్రటరీ ప్రతి రోజు నిర్దేశించిన ప్రాంతాల్లో 15 రోజులకు ఒకసారి విజిట్ చేసి ఆ ఇంటికి సప్లయ్ చేస్తున్న వాటర్ క్వాలిటీ, క్వాంటిటీలను చెక్ చేసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో పైప్‌లైన్లు, వాటర్ ట్యాప్స్ లీకులు ఏమైనా ఉంటే వాటిని ఆ యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత ఏఈ, డీఈ, ఈఈలకు ఆన్‌లైన్ ద్వారా చేరుతాయని వివరించారు. రానున్న మంగళవారం నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం తాగునీటి నాణ్యత పరీక్ష పరికరాలను కార్యదర్శులకు అందజేశారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సంజయ్, చంద్రయ్య, సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు మొదలయ్యాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయి. వర్షాకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు. దోమకాటు వల్ల కలిగే వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉండడం ద్వారానే దోమకాటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు అని వెల్లడిస్తున్నారు.

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- ఆహారం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వేగూరులో మురుగునీటిలో బ్లీచింగ్ చేయిస్తున్న ఆశా వర్కర్లు



ఇనమడుగులో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కోవూరు : వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. మన ఇంట్లోనే నిల్వ నీటిలో పెరిగే దోమల ద్వారా డెంగీ, మలేరియా సోకే అవకాశం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఆ వ్యాధులు సోకకుండా ఉండాలంటే ఇంటితో పాటు, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వైద్యశాఖ సిబ్బంది అవగాహన కలిగిస్తున్నారు. రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, ఫ్లవర్ కుండీలు, ఇంటి బయట ఉండే కొబ్బరిచిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో వర్షం నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయంటున్నారు. ప్రజలు తీసుకునే జాగ్రత్తలతోనే వ్యాధులను అరికట్ట వచ్చునని చెబుతున్నారు.

కలుషిత నీరు, ఆహారంతో..

వర్షాకాలంలో కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియా సోకే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే విడవలూరుతో పాటు పలు ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయి. బయటి ప్రాంతాల్లో తీసుకునే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ వాంతులు, విరేచనాలు అవుతుంటే వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలని తెలియజేస్తున్నారు. రెండు నుంచి మూడు సార్లు విరేచనాలు, వాంతులు అయితే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలని, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యశాఖ అప్రమత్తం

సీజనల్ వ్యాధుల విషయంలో వైద్యశాఖ అప్రమత్తమైంది. దోమకాటు, కలుషిత నీరు ఆహారం విషయంలో ప్రజలకు విస్తృత అవగాహన కలిగించడంతో పాటు, ఇంటింటి సర్వే నిర్వహించి దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్న వాటిని గుర్తించనున్నారు. అందుకు సంబంధించి వైద్యులు, వైద్య సిబ్బందికి ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారా.. లేదా, వాటిలో క్లోరినేషన్ శాతం వంటి వాటిని వైద్య సిబ్బంది తనిఖీ చేయనున్నారు. ప్రభుత్వాస్పత్రి, ఏరియా ఆస్పత్రులకు వచ్చిన జ్వరం కేసులపై నిఘా ఉంచి, ఏ ప్రాంతం నుంచి వచ్చాయో తెలుసుకుని, ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయనున్నారు.

అన్ని చర్యలు తీసుకున్నాం

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే చేపట్టాల్సిన చర్యల గురించి వైద్యాధికారులకు సదస్సులు నిర్వహించాం. దోమకాటు వ్యాధుల నియంత్రణతో పాటు కలుషిత నీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశాం. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ ఇర్ఫాన్, వైద్యాధికారి, ఇనమడుగు పీహెచ్‌సీ

లైసెన్సులను రద్దు చేస్తాం

• ఎఫ్‌డీఓ పొట్టయ్య



మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ పొట్టయ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్న రైతులను గుర్తించి వారి లైసెన్సులను రద్దు చేస్తామని బుచ్చిరెడ్డిపాళెం ఎఫ్‌డీఓ పొట్టయ్య హెచ్చరించారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపల సాగు చేస్తున్న రైతులు వాటికి మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్నారన్నారు. దీనివల్ల సమీప గ్రామస్తులు దుర్వాసన కారణంగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై తమ సిబ్బందితో కలిసి నిత్యం గ్రామాల్లో పర్యటించి చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి లైసెన్సులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. చికెన్ వ్యర్థాలను తీసుకొస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహకారం అందించాలని, చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటికైనా చేపల గుంతలు సాగు చేస్తున్న రైతులు చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేయకుండా ప్రత్యామ్నాయ ఆహారాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.

బ్రిడ్జి లేక.. ప్రయాణం కష్టంగా..



అల్లూర్తి–నావూరు రహదారి మధ్యలో ఉన్న వాగు

పొదలకూరు : మండలంలోని అల్లూర్తి–నావూరు రహదారి మధ్యనున్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో ప్రయాణం కష్టంగా మారింది. ఇక్కడ బ్రిడ్జిని పూర్తి చేస్తే రాకపోకలు పెరగడంతో పాటు, దూరం తగ్గుతుంది. అయితే వివిధ కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణ అంచనాలు పూర్తి చేసుకున్నా ఆచరణలో జాప్యం నెలకొంటోంది. మండలంలోని అల్లూర్తి–నావూరు లింకురోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేయించారు. ఈ అధికారుల ద్వారా కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు. తిరిగి ప్రతిపాదనలను పంపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తే వర్షాకాలంలో రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అల్లూర్తి–నావూరు రోడ్డు మధ్యలో వాగుపై తాత్కాలిక పైపు కల్వర్టు నిర్మాణానికి గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు. కల్వర్టు పనులు పూర్తి చేస్తే వాగు ఉధృతికి కల్వర్టు నిలువదనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం స్వల్పంగా వాగు నుంచి నీరు ప్రవహిస్తోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డు మీదుగా పులికల్లు, మొగళ్లూరు, అంకుపల్లి, ఆర్‌వైపాళెం, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల నుంచి అల్లూర్తి మీదుగా నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లవచ్చు. ఇదే రహదారి మీదుగా నేదురుమల్లి, బత్తులపల్లి, సంగం వరకు పైగ్రామాల ప్రజలు వెళ్లేందుకు అవకాశం ఉంది.

‘ఏకలవ్య’లో ఉన్నత ప్రమాణాలతో బోధన




విద్యార్థినికి అడ్మిషన్ లెటర్ ఇస్తున్న పీఓ

• ఐటీడీఏ పీఓ రాణి మందా

కొడవలూరు : ఈఎంఆర్‌ఎస్(ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్) పాఠశాల, కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతో సీబీఎస్‌ఈ సిలబస్ బోధన ఉంటుందని ఐటీడీఏ పీఓ రాణి మందా తెలిపారు. మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్‌ఎస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరికకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె, పదిలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీబీఎస్‌ఈ పద్ధతిలో దేశమంతా ఒకే సిలబస్ ఉంటుందని తెలిపారు. ఈఎంఆర్‌ఎస్‌లలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఉన్నత ప్రమాణాలతో బోధన సాగుతుందన్నారు. ఎస్టీ పిల్లలకు పైసా ఖర్చు లేకుండా సకల వసతులతో మెరుగైన బోధన అందించడమే ఈఎంఆర్‌ఎస్ లక్ష్యమన్నారు. ఇందులో సీట్ల కేటాయింపు ఎంతో పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా జరుగుతుందన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన వారు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇక్కడ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నందున ఇక్కడ పది పూర్తి చేసుకున్న వారే ఇంటర్‌లోనూ చేరుతున్నట్లు తెలియజేశారు. మిగిలిన సీట్లను మాత్రమే బయటి విద్యార్థులతో భర్తీ చేస్తామని చెప్పారు. జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఉన్న ఖాళీలను బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశామన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో వంద శాతం సీట్లు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శివకుమార్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై కేసు నమోదు



అక్రమంగా ఇచ్చిన విద్యుత్ కనెక్షన్

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నాగార్జున బుధవారం తెలిపారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన రఘురామయ్య ఇంటికి అక్రమ మార్గంలో కరెంటు వైరు వేసి ఏసీ వాడుతున్నాడని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేశామన్నారు. అక్రమ విద్యుత్ వాడకం నిజమని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

జాగ్రత్తలతో రక్తహీనతకు చెక్



సంజీవనగర్‌లో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : ముందు జాగ్రత్త చర్యల ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చని కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని సంజీవనగర్‌లో గిరిజనులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో తలెత్తుతున్న రక్తహీనతకు స్వస్తి చెప్పేందుకు వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించిందన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ‘నేషనల్ సికెల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్’ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. ఇందులో భాగంగా అన్ని గిరిజన కాలనీల్లో వంద శాతం మందికి రక్తపరీక్షలు నిర్వహించి రక్త శాతాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎవరిలోనైనా రక్త శాతం మందగిస్తే రక్త హీనతకు దారి తీసే ప్రమాదం ఉందని నిర్ధారిస్తామన్నారు. అలాంటి వారికి పోషకాహారం, ఐరన్ మాత్రలు అందేలా చూసి సమస్య రాకుండా నివారిస్తామన్నారు. పోషకాహారం లోపించినప్పుడే రక్తహీనత తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు. రక్తహీనత కేన్సర్‌కు దారి తీస్తుందన్న విషయంపై అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం టి.రాధమ్మ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం రేపు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ముత్తుకూరు : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 14వ తేదీన జరుగుతుందని ఆ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గోడ భాస్కర్ చెప్పారు. స్థానిక శ్రామిక భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ ఏర్పడి 54 సంవత్సరాలు పూర్తవుతుందని, దీని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్టు మెయిన్ గేటు వద్ద 14వ తేదీన మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నాగరాజు, నక్కా శ్యామ్‌ప్రసాద్, ఆనూరి అనిల్ పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



సర్వేపల్లి వైపు వెళ్లే మార్గంలో చదును చేయకుండా వదిలేసిన రోడ్డు మార్జిన్



పాలిచెర్లపాడు సమీపంలో ప్రమాదకంగా రోడ్డు మార్జిన్

• పట్టించుకోని అధికారులు

వెంకటాచలం : మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ప్రమాదపుటంచులో ప్రయాణాలు సాగిస్తున్నారు. నిత్యం ఏదో ఒక గ్రామంలో రోడ్డు అంచులు సక్రమంగా లేక ప్రమాదాలకు గురవుతున్నారు. పాలిచెర్లపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డు అంచున గ్రావెల్ తరలించి రోలింగ్ చేయాల్సి ఉంది. అయితే కసుమూరు నుంచి పాలిచెర్లపాడు వరకు రోడ్డుకు ఇరువైపులా సుద్ద మట్టిని తరలించి రోలింగ్ చేయకుండా వదిలేశారు. దీంతో రాకపోకలు చేసే వాహనాలు రోడ్డు దిగితే మట్టిలో వాహనాలు అదుపుతప్పి బోల్తాపడి ప్రమాదాలకు గురవుతున్నాయి. పాలిచెర్లపాడు మీదుగా నిత్యం కంకర టిప్పర్లు తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనచోదకులు రోడ్డు దిగి ప్రయాణించడం తప్పనిసరి అయింది. అయితే రోడ్డు దిగితే మట్టిలో ద్విచక్ర వాహనం ఇరుక్కుని ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళ్లే రోడ్డు మార్గంలో తరచూ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు అంచున కేబుల్ వర్క్ నిమిత్తం తవ్వకాలు చేసి చదును చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని రోడ్డు మార్జిన్‌లో గ్రావెల్ తరలించి రోలింగ్ చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కోతకు గురవుతున్న బీచ్‌లు



కాటేపల్లి బీచ్‌లో నీరు ముందుకు రావడంతో కోతకు గురవుతున్న తీరం

తోటపల్లిగూడూరు : వాతావరణంలో చోటుచేసుకొంటున్న పెను మార్పులు, అలల ఉధృతి కారణంగా సముద్రపు నీరు ముందుకు చొచ్చుకొని వస్తోంది. మండలంలోని కోడూరు, కాటేపల్లి తీర ప్రాంతాల్లో ఈ రకమైన ఘటనలు గత కొద్ది కాలంగా వెలుగుచూస్తోంది. సాధారణం కంటే సుమారు 50 మీటర్ల మేర సముద్రపు నీరు ముందుకు వస్తోంది. దీంతో తీర ప్రాంత వాసులు, మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు, కాటేపల్లి సముద్రతీర ప్రాంతాల్లో గత కొద్దిరోజులుగా అలలు ఉవ్వెత్తిన ఎగసి పడుతున్నాయి. ఈ క్రమంలో తీరం కోతకు గురవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా అలల ఉధృతి పెరగడమే కాకుండా సముద్రపు నీరు ఊహించని రీతిలో ముందుకు వస్తుండడం పట్ల తీర ప్రాంత వాసులు, అధికారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కోడూరు బీచ్ కంటే కాటేపల్లి సముద్రతీరం అధికంగా కోతకు గురవుతోంది. ఈ పరిణామాలతో పర్యాటకులు సైతం భయాందోళనకు గురవుతున్నారు.

విద్యాకిట్ల పంపిణీకి బ్రేక్

• పాఠ్యపుస్తకాలు రెడీ



విద్యావనరుల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ముత్తుకూరు : వేసవి సెలవుల తర్వాత గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో గత ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యా కిట్లు నేటి వరకు మండల కేంద్రాలకు చేరలేదు. ప్రతి సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ఆయా స్కూళ్లకు చేరిపోయే విద్యాకానుక కిట్లు నేటి వరకు ఆచూకీ లేకపోవడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మండలంలో ఒక గురుకుల పాఠశాల, ఏడు యూపీ, ఆరు హైస్కూళ్లు, 57 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం ఒకటి నుంచి పది తరగతులకు పాఠ్య పుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారు. నోటు పుస్తకాల విషయానికి వస్తే ఒక్క లాంగ్ నోటు బుక్ మాత్రమే పంపించారు. వీటిని ఆయా పాఠశాలలకు చేరవేస్తున్నారు. వాస్తవానికి విద్యా కానుక కిట్‌లో యూనిఫాం, బెల్టు, బూట్లు, సాక్సులు, డిక్షనరీ తదితర సామగ్రి ఉంటుంది.